# దవాఖానపై దయచూపండి!



కరీంనగర్ ప్రభుత్వ ప్రధాన దవాఖాన

- ఉత్తర తెలంగాణకే కేంద్రబిందువుగా కరీంనగర్ జీజీహెచ్
- పది జిల్లాలతోపాటు పక్క రాష్ట్రం నుంచి రోగుల తాకిడి
- కానరాని సూపర్ స్పెషాలిటీ డిపార్ట్‌మెంట్లు
- సేవలు లేక వరంగల్, హైదరాబాద్‌కు రెఫర్
- అత్యవసర సమయాల్లో గాల్లో కలుస్తున్న ప్రాణాలు
- ఎంఆర్ఐ స్కానింగ్ మిషన్ లేక పేదలపై ఆర్థిక భారం
- నర్సింగ్ కళాశాలపై నీలినీడలు
- మెడికల్ కాలేజీ హాస్టల్‌లో వసతులు లేక ఇబ్బందులు
- బస్సు సౌకర్యం లేక విద్యార్థులకు తిప్పలు
- నేడు హెచ్‌డీఎస్ సమావేశం
- హాజరుకానున్న మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్, ఎమ్మెల్యేలు
- సేవలు, వసతుల కల్పనపై దృష్టిసారించాలని వేడుకోలు

ఉత్తర తెలంగాణకు తలమానికంగా ఉన్న కరీంనగర్ గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ (జీజీహెచ్)కు చుట్టు పక్కల పది జిల్లాలతోపాటు పక్క రాష్ట్రం నుంచి తాకిడి ఉంటున్నది. అయితే ఇక్కడ సూపర్ స్పెషాలిటీ సేవలు లేక మెరుగైన వైద్యం కోసం వరంగల్, హైదరాబాద్ దవాఖానలకు రెఫర్ చేయాల్సి వస్తున్నది. కొన్నిసార్లు అత్యవసర పరిస్థితుల్లో రోగుల ప్రాణాలకు భరోసా లేకుండా పోతున్నది. ప్రధానంగా ఇక్కడ ఎంఆర్ఐ స్కానింగ్ మిషన్ లేక పేదలు ప్రైవేట్ చేయించుకోవాల్సి వస్తుండగా, ఆర్థిక భారం పడుతున్నది. నర్సింగ్ కాలేజీ ఏర్పాటు చేస్తే మరిన్ని మరిని ప్రయోజనాలు అందుబాటులోకి రానుండగా.. అది ఇంకా కలగానే మిగిలింది. నేడు జీజీహెచ్‌లో దవాఖాన అభివృద్ధి కమిటీ సమావేశం జరుగుతుండగా, మంత్రి పొన్నం ప్రభాకర్‌తోపాటు కలెక్టర్, ఎమ్మెల్యేలు హాజరవుతున్నారు. ఈ పరిస్థితుల్లో దవాఖానపై దయచూపాలని, మరిన్ని మెరుగైన సదుపాయాలు కల్పించాలని రోగులు కోరుతున్నారు.

విద్యానగర్, జూన్ 17: కరీంనగర్ ప్రభుత్వ దవాఖానకు ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల నుంచే కాకుండా మహారాష్ట్ర నుంచి కూడా రోగుల తాకిడి ఉంటుంది. అయితే, ఇక్కడి వైద్య వ్యవస్థను మరింత సమర్థవంతంగా పనిచేయించడంతోపాటు మెరుగైన సదుపాయాలు కల్పించాలనే డిమాండ్ సర్వత్రా వ్యక్తమవుతున్నది. రోడ్డు ప్రమాదాలు, అత్యవసర వైద్యం కోసం కరీంనగర్ ప్రభుత్వ వైద్యశాలకు రోగులు వస్తుండగా.. ఇక్కడ సూపర్ స్పెషాలిటీ సేవలు లేక ఇబ్బందులు పడుతున్నారు. సదుపాయాలు లేవని వైద్యులు వరంగల్, హైదరాబాద్‌లోని ప్రభుత్వ దవాఖానలకు రెఫర్ చేస్తుండగా.. కొన్నిసార్లు మార్గమధ్యంలోనే ప్రాణాలు వదులుతున్నారు. కరీంనగర్ దవాఖానలో సూపర్ స్పెషాలిటీ సేవలు అందుబాటులోకి వస్తే ఈ పరిస్థితి ఉండేది కాదని అభిప్రాయపడుతున్నారు.

## సౌకర్యాలు కల్పిస్తేనే..

జనరల్ హాస్పిటల్‌లో ఏన్నో ఏళ్ల నుంచి ఎంఆర్ఐ స్కానింగ్ లేక పేదలు ఇబ్బంది పడుతున్నారు. ప్రైవేట్‌లో చేయించాల్సి వస్తుండడంతో ఆర్థిక భారం పడుతున్నదని, వెంటనే ఎంఆర్ఐను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. డిజిటల్ ఎక్స్‌రేలకు ఫిలింలు లేవని, ఎక్స్‌రే తీసుకునే ప్రతి పెషంట్‌కు ఫిలింలు ఇవ్వాలని కోరుతున్నారు. దవాఖాన చుట్టూ ప్రహరీతోపాటు గదులను రెనోవేషన్ చేయాలని కోరుతున్నారు. హాస్పిటల్‌లో 542 పడకలు ఉన్నప్పటికీ 700 మంది పెషెంట్లు ఇన్‌పేషెంట్లుగా ఉంటున్నారని, రోజుకు వెయ్యి మందికి పైగా ఔట్ పేషంట్లు వస్తున్నారని వైద్యాధికారులు తెలిపారు. రాష్ట్రంలోనే అత్యధికంగా ప్రసవాలు జరిగిన మాతా శిశు ఆరోగ్య కేంద్రంగా కరీంనగర్ రికార్డు సాధించిందని, అలాంటి హాస్పిటల్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ప్రజలు కోరుతున్నారు.

## వసతుల కల్పనేది?

కేసీఆర్ పాలనలో మూడో విడుత కింద కరీంనగర్ జిల్లాకు మెడికల్ కళాశాలను మంజూరు చేశారు. దీనిని జిల్లా కేంద్రానికి సమీపంలోని కొత్తపల్లిలో ఏర్పాటు చేశారు. తరగతులు కూడా నిర్వహిస్తున్నారు. ఈ కాలేజీకి అనుబంధంగా నర్సింగ్ కళాశాలను ఏర్పాటు చేయాలని, లేదా ప్రభుత్వ నర్సింగ్ పాఠశాలను అప్‌గ్రేడ్ చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఇటు మెడికల్ కాలేజీలో సరిపడా వైద్యులు, సిబ్బందిని నియమించాలంటున్నారు. అలాగే వైద్య కళాశాల హాస్టల్‌లో వసతులు సరిగ్గా లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఒకే బస్సు ఉండడంతో ట్రాన్స్‌పోర్ట్ ఇబ్బందిగా మారిందని, మరో బస్సును ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ప్రభుత్వం నిర్మిస్తున్న వైద్య కళాశాలను వెంటనే పూర్తి చేయాలని, వైద్య కళాశాలకు అనుబంధంగా నర్సింగ్ కళాశాలను ఏర్పాటు చేయాలని విద్యార్థులు కోరుతున్నారు.

## నేడు హెచ్‌డీఎస్ సమావేశం


హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీ (హెచ్‌డీఎస్) సమావేశం మంగళవారం ఉదయం 11 గంటలకు దవాఖానలోని సమావేశమందిరంలో నిర్వహించనున్నారు. దీనికి మంత్రి హోదాలో పొన్నంప్రభాకర్ మొదటి సారిగా హాజరవుతున్నారు. అలాగే కలెక్టర్, ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, కవ్వంపల్లి సత్యనారాయణ, మేయర్ సునీల్‌రావు హాజరు కానున్నారు. అయితే, కరీంనగర్ ఎంపీగా ఉన్నప్పుడు పొన్నం ప్రభాకర్ దవాఖానపై ప్రత్యేక శ్రద్ధ చూపారు. ఇప్పుడు కూడా అదేవిధంగా ప్రత్యేక దృష్టి సారిస్తారని, ప్రత్యేక సదుపాయాలను కల్పించి అభివృద్ధి చేస్తారని ప్రజలు భావిస్తున్నారు.

# రైతుకు భరోసా ఏది?

- నాడు సీజన్ ప్రారంభంలోనే అందిన రైతుబంధు
- నేడు నేటికీ అమలుకాని కొత్త ప్రభుత్వ పథకం
- ఎదురు చూస్తున్న రైతులు
- ఎన్నికల ముందు రైతుకు, కౌలు రైతుకు ₹15 వేలు, వ్యవసాయ కూలీలకు ₹12 వేలు ఇస్తామన్న కాంగ్రెస్
- అధికారంలోకి వచ్చిన తర్వాత అమలులో జాప్యం
- ఇప్పటికీ అతీగతి లేని పెట్టుబడి సాయం

## నాడు

పెట్టుబడుల కోసం రైతులు అప్పులు చేస్తున్నారని గ్రహించిన రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ రైతుబంధు పథకాన్ని ప్రారంభించగా, తమకు అందిన ఆర్థికసాయంతో రైతులు పెట్టుబడి అవసరాలను తీర్చుకున్నారు. సీజన్ ప్రారంభంలోనే ప్రతి ఎకరాకు సీజన్‌కు ₹5 వేల చొప్పున ఏడాదిలో ₹10 వేల చొప్పున వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయడంతో సంబురంగా విడిపించుకుని విత్తనాలు, ఎరువులు, దుక్కులు దున్నడం వంటివాటికి వినియోగించుకునేవారు.



## నేడు

రైతుబంధు పథకాన్ని కాస్తా రైతు భరోసాగా మార్చిన ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు సీజన్‌కు ఎకరాకు ₹7,500 చొప్పున ఏడాదికి ₹15 వేల ఆర్థికసాయాన్ని అందిస్తామని చెప్పింది. అంతే కాకుండా.. కౌలురైతులకు కూడా ఈ పథకాన్ని వర్తింపజేస్తామనడంతోపాటు వ్యవసాయ కూలీలకు ఏడాదికి ₹12 వేల చొప్పున ఇస్తామని నమ్మబలికింది. కానీ, ఈ సీజన్ ప్రారంభమై పదిహేను రోజులైనా ఇప్పటి వరకు రైతు భరోసా ప్రస్తావనే లేకుండా పోయింది. కళ్లల్లో వత్తులేసుకుని ఎదురు చూస్తున్న రైతులు పెట్టుబడుల కోసం తిరిగి అప్పులు చేయాల్సిన దుస్థితి దాపురించింది.

కరీంనగర్, జూన్ 17 (నమస్తే తెలంగాణ) : బీఆర్ఎస్ సర్కారు తెచ్చిన రైతుబంధు పథకం దేశంలోనే ఒక సంచలనంగా మారింది. పలు రాష్ట్ర ప్రభుత్వాలు దీనిని తమ రాష్ట్రాల్లో అమలు చేయాలనే నిశ్చయానికి వచ్చాయి. ఏకంగా కేంద్ర ప్రభుత్వమే ఈ పథకాన్ని కాపీకొట్టి కిసాన్ సమ్మాన్ నిధి పథకాన్ని అమలులోకి తెచ్చింది. 2018 వానకాలం సీజన్‌లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ పథకాన్ని గొప్పగా ప్రారంభించింది. పెట్టుబడుల కోసం రైతులు అప్పులు చేస్తూ వాటిని తీర్చలేని పరిస్థితుల్లో ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, ఫలితంగా అనేక రైతు కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతున్నాయని గ్రహించిన రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ బృహత్తర పథకానికి శ్రీకారం చుట్టారు. ఈ పథకాన్ని కరీంనగర్ జిల్లా నుంచే ప్రారంభించారు. మొదట ఎకరానికి రూ.4 వేల చొప్పున ఆ తర్వాత రూ.5 వేల చొప్పున అందించారు. కరోనా సీజన్‌లో ఆర్థికంగా ఎదురైన విపత్తును సైతం లెక్క చేయకుండా రైతుల ఖాతాల్లో నగదు జమచేసింది. సాగు చేసిన ప్రతి రైతుకూ ఈ పథకం కింద ఆర్థికసాయం అందింది. ఈ నేపథ్యంలో అత్యంత ఆదరణ పొందిన పథకాల్లో ఒకటిగా నిలిచి పోయింది.




## నేడు ఒక్క సీజన్‌కైనా దక్కని భరోసా

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పథకం పేరును రైతు భరోసాగా మార్చింది. ఈ పథకం కింద ప్రతి ఎకరాకు ప్రతి సీజన్‌కు ₹7,500 చొప్పున ఏడాదికి ₹15 వేలు ఇస్తామని, ఇది కౌలు రైతులకు కూడా వర్తిస్తుందని గత అసెంబ్లీ ఎన్నికల్లో హామీ ఇచ్చింది. అంతే కాకుండా వ్యవసాయ కూలీలకు కూడా ఏడాదికి ₹12 వేల చొప్పున ఆర్థికసాయం అందిస్తామని హామీలు గుప్పించింది. అయితే, అధికారంలోకి వచ్చిన తర్వాత గత యాసంగిలో రైతుబంధు మాదిరిగానే ఎకరాకు ₹5 వేల చొప్పున మాత్రమే విడుదల చేసింది. ఇది కూడా రైతులందరికీ అందలేదు. గత యాసంగిలో 2,03,096 మంది రైతుల ₹182.01 కోట్లు ఇవ్వాల్సి ఉండగా, నాలుగైదు ఎకరాలున్న రైతుల వరకే ఆర్థికసాయం అందింది. ఐదెకరాలకుపైగా ఉన్న రైతులకు నిరాశే మిగిలింది. వచ్చే వానకాలం సీజన్ నుంచి తామిచ్చిన హామీ మేరకు రైతు భరోసా కింద ఎకరాకు ₹15 వేల చొప్పున అందిస్తామని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. కానీ, ఇప్పటి వరకు ఈ ఊసే లేకుండా పోయింది.

## వానకాలం సీజన్‌పై రైతుల ఆశలు

రైతు భరోసా కింద వానకాలమైనా పెట్టుబడి సాయం అందుతుందని ఆశించిన రైతులకు నిరాశే మిగులుతోంది. సీజన్ ప్రారంభమై పదిహేను రోజులు గడుస్తున్నా రాష్ట్ర సర్కారు ఈ పథకంపై ఇప్పటి వరకు ఒక స్పష్టమైన ప్రకటన చేయలేదు. గత ప్రభుత్వ హయాంలో సీజన్ ప్రారంభానికి ముందే అంటే వానకాలం అయితే మే నెలలోనే రైతుబంధు ప్రారంభమయ్యేది. ఎకరం భూమి ఉన్న రైతులతో ప్రారంభించి వారం పది రోజుల్లో ఈ ప్రక్రియను ముగించే వారు. ఇప్పుడు జూన్ నెల గడుస్తున్నా రైతు భరోసా కింద పెట్టుబడి సహాయం అందడం లేదు. గత వానకాలం సీజన్‌లో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం జిల్లాకు చెందిన 1,93,330 మంది రైతులకు ₹181.89 కోట్ల ఆర్థిక సహాయాన్ని అందించింది. జూన్ మొదటి వారంలోనే ఈ ప్రక్రియ ముగిసింది. ఈ సీజన్‌కు ప్రభుత్వం పెట్టుబడి సాయం చేస్తుందా? లేదా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఐదెకరాల కంటే ఎక్కువ భూమి ఉన్న రైతులకు, ప్రభుత్వ ఉద్యోగులు, ఐటీ చెల్లించే వారికి ఈ పథకం కింద పెట్టుబడి సాయాన్ని నిలిపివేస్తారని ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో అసలు రైతు భరోసా అమలు చేస్తారా? లేదా? అనే విషయంలోనే స్పష్టత లేకుండా పోయింది..

## మళ్లీ అప్పులపాలు చేసేటట్టున్నరు



బీఆర్ఎస్ సర్కారు ఉన్నప్పుడు పంట పెట్టుబడి కోసం రైతుబంధు టైముకు వచ్చేది. ఇప్పుడు వానకాలం సీజన్ మొదలైనా రైతుభరోసా కింద ఇస్తామన్న పెట్టుబడి సాయం ఇంకా ఇస్తలేరు. నార్లు పోసుకోవడానికి సీడ్ వడ్లు కొంటున్నం. ఇప్పుడిస్తే పంటలకు ఏమన్న పని చేస్తది. అవసరం తీరినంక ఇస్తే ఏం లాభం.. మళ్లీ మునుపటిలెక్కనే రైతులను అప్పుల పాలు చేసేటట్టున్నరు.

- పాశం అశోక్‌రెడ్డి, రైతు, మొగిలిపాలెం(తిమ్మాపూర్)


సాలెహ్‌నగర్ ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

# భక్తిశ్రద్ధలతో బక్రీద్

భక్తి విశ్వాసాలు, త్యాగానికి ప్రతీక అయిన బక్రీద్ పండుగను సోమవారం ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. అన్ని మసీదులు, ఈద్గాల్లో సామూహిక ప్రార్థనలు చేశారు. ప్రధానంగా రేకుర్తిలోని సాలేహ్‌నగర్, కళాభారతి వద్ద, బైపాస్ రోడ్, చింతకుంటలో గల ఈద్గాలకు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా మత్త పెద్దలు సందేశాలు ఇచ్చారు. అనంతరం ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు, పలు పార్టీల నాయకులు ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు.

- కమాన్‌చౌరస్తా, జూన్ 17


అశోక్‌కుమార్


సన్‌ప్రీత్ సింగ్

# జగిత్యాల ఎస్పీగా అశోక్ కుమార్

సూర్యాపేటకు సన్‌ప్రీత్ సింగ్

జగిత్యాల కలెక్టరేట్, జూన్ 17 : జగిత్యాల ఎస్పీగా 2019 బ్యాచ్‌కు చెందిన అశోక్ కుమార్‌ను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. రామగుండం కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల డీసీపీగా విధులు నిర్వర్తిస్తున్న అశోక్‌కుమార్‌ను జగిత్యాల ఎస్పీగా, ఇక్కడ విధులు నిర్వహిస్తున్న సన్‌ప్రీత్ సింగ్‌ను సూర్యాపేట ఎస్పీగా బదిలీ చేశారు. గతేడాది అక్టోబర్‌లో ఎస్పీగా వచ్చిన సన్‌ప్రీత్ సింగ్ జిల్లాలో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించారు.

# ప్రాణం తీసిన ఆస్తి తగాదాలు

- పెద్ద కొడుకుపై తండ్రి, తమ్ముడితోపాటు కుటుంబ సభ్యుల దాడి
- హైదరాబాద్ తరలిస్తుండగా మృతి
- కోరుట్ల మండలం మోహన్‌రావుపేటలో ఘటన


కోట రాజేశ్(ఫైల్)

కోరుట్ల రూరల్, జూన్ 17 : రెండేళ్ల నుంచి నడుస్తున్న ఆస్తి తగాదాలు చివరకు నిండు ప్రాణాన్ని బలిగొన్నాయి. తండ్రి, తమ్ముడితోపాటు మరికొందరు కుటుంబ సభ్యుల దాడిలో పెద్ద కొడుకు ప్రాణాలు గాల్లో కలిశాయి. పోలీసుల వివరాల ప్రకారం.. కోరుట్ల మండలంలోని మోహన్‌రావుపేటకు చెందిన కోట గంగరాజానికి రాజేశ్ (35), రాకేశ్ ఇద్దరు కొడుకులు. వీరి మధ్య రెండేళ్లుగా ఆస్తి తగాదాలు జరుగుతున్నాయి. ఆదివారం రాత్రి 9గంటల తర్వాత కుడా గొడవ జరిగింది. ఈ క్రమంలో రాజేశ్‌పై తండ్రి, తమ్ముడుతోపాటు మరికొందరు కుటుంబ సభ్యులు, రాకేశ్ స్నేహితులు రాజేశం, నరేశ్ పదునైన ఆయుధాలతో దాడి చేశారు. తీవ్రగాయాలైన రాజేశ్‌ను కోరుట్ల ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్లగా, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలించారు. రాజేశ్ పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు సోమవారం తెల్లవారుజామున హైదరాబాద్‌కు తరలిస్తుండగా.. మార్గమధ్యలో మృతి చెందాడు. ఘటనా స్థలాన్ని సీఐ సురేశ్‌బాబు, ఎస్ఐ కిరణ్‌కుమార్ పరిశీలించారు. రాజేశ్‌కు భార్య లాస్య, కొడుకు, కూతురు ఉన్నారు. లాస్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.


రోదిస్తున్న కుటుంబసభ్యులు, పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి

# డాడీ.. రా డాడీ


విజయ్ కుమార్ (ఫైల్)

- నన్ను కాపాడేందుకు దూకి మమ్మల్ని వదిలిపోతివా..?
- ఫాదర్స్ డే మరుసటి రోజే విడిచిపోయావా..?
- గుండెలవిసేలా రోదించిన విజయ్ కూతురు సాయినిత్య
- సెల్ఫీ తీసుకుంటుండగా అనుకోని ప్రమాదం
- నీటిలో పడ్డ బిడ్డ.. రక్షించేందుకు దూకిన తండ్రి.. ఆ వెంటే కొడుకు
- ముగ్గురు మునక.. కుటుంబసభ్యుల కేకలు
- నీటిలో దూకి పిల్లలను కాపాడిన మత్స్యకారుడు

'డాడీ.. ఫాదర్స్ డే రోజు మాతో సంతోషంగా గడిపితివి. మండే హాలీడే అని టెంపుల్‌కు తీసుకెళ్తివి. తిరిగి వచ్చేటప్పుడు డ్యాం చుద్దామని లోపలికి తీసుకెళ్తివి. నీటిలో పడిపోయిన నన్ను కాపాడేందుకు దూకు నువ్వు మునిగిపోతివి కదా డాడీ.. అమ్మను, నన్ను, తమ్ముని వదిలిపోయావా డాడీ.. రా డాడీ..' అంటూ ఎల్ఎండీ రిజర్వాయర్‌లో మృతిచెందిన తన తండ్రి విజయ్ కుమార్‌ను తలుచుకుంటూ ఆ కూతురు సాయినిత్య గుండెలవిసేలా రోదించింది. డాడీ ఇక లేడని తెలిసి అక్కా తమ్ముళ్లు రోదించిన తీరు ప్రతి ఒక్కరినీ కంటతడి పెట్టించింది. సోమవారం జరిగిన ఈ ఘటన ఆ కుటుంబానికి తీరని దుఃఖాన్ని మిగిల్చింది.

తిమ్మాపూర్, జూన్17: కరీంనగర్ జిల్లా కేంద్రంలోని సంతోష్‌నగర్‌లో నివాసం ఉండే బంగారి విజయ్‌కుమార్(47) కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలో వర్క్స్, ప్రాజెక్ట్స్ డిపార్ట్‌మెంట్‌లో అసిస్టెంట్ పే అండ్ అకౌంట్స్ ఆఫీసర్‌గా పని చేస్తున్నాడు. సోమవారం సెలవు దినం కావడంతో భార్య ప్రశాంతి, కూతురు సాయినిత్య, కొడుకు విక్రాంత్, అత్త పుష్పలతతో కలిసి హుస్నాబాద్‌లోని పొట్లపల్లి శివాలయానికి కారులో వెళ్లాడు. వీరంతా తిరిగి వస్తుండగా మార్గమధ్యంలో మధ్యాహ్నం 12.30 గంటల ప్రాంతంలో ఎల్ఎండీ రిజర్వాయర్‌ను చూసేందుకు వెళ్లారు. కట్టపై నుంచి డ్యాంలోకి దిగి లోతుగా ఉండే కాకతీయ కాలువలోకి నీళ్లు వెళ్లే ప్రాంతంలో సరదాగా గడిపారు. అంతలోనే విషాదం వెంటాడింది. బీటెక్ ఫస్టియర్ చదువుతున్న కూతురు సాయినిత్య సెల్ఫీ దిగే క్రమంలో ఒక్కసారిగా అదుపుతప్పి నీళ్లలో పడిపోయింది. వెంటనే తండ్రి విజయ్ ఒక్క ఉదుటున నీళ్లలోకి దూకి కాపాడేందుకు ప్రయత్నిస్తుండగా, ఇద్దరూ మునిగిపోసాగారు. ఇది చూసిన పదో తరగతి చదివే కొడుకు విక్రాంత్ సైతం నీటిలోకి దూకగా.. ముగ్గురూ నీటిలో మునిగిపోసాగారు. భార్య ప్రశాంతి, ఆమె తల్లి పుష్పలత గట్టిగా కేకలు వేయడంతో సమీపంలో ఉన్న మత్స్యకారుడు శంకర్ అప్రమత్తమయ్యాడు. వెంటనే అక్కడికి వచ్చి నీటిలోకి దిగి పిల్లలు సాయినిత్య, విక్రాంత్‌ను కాపాడి గట్టుకు తీసుకువచ్చాడు. విజయ్ కోసం గాలించగా క్షణాల్లో మునిగి గల్లంతయిపోయాడు. పిల్లలు కుటుంబసభ్యులతోపాటు పోలీసులకు సమాచారం అందించగా, సంఘటనా స్థలానికి తిమ్మాపూర్ సీఐ స్వామి, ఎల్ఎండీ ఎస్ఐ చేరాలు చేరుకున్నారు. రెస్క్యూ టీం, స్థానిక జాలర్లు పాతాలగరిగె సాయంతో గాలించారు. కొద్దిసేపటిలోనే విజయ్‌కుమార్ మృతదేహం దొరకడంతో కుటుంబసభ్యులు గుండెలవిసేలా రోదించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఘటన స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. కుటుంబసభ్యులకు అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. భార్య ప్రశాంతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

## 'నాన్న వస్తాడు.. నాన్నకేం కాదు'

రెప్పపాటులో బతికిన సాయినిత్య, విక్రాంత్ తమ తండ్రి గల్లంతవడంతో కూతురు, కొడుకు భయాందోళనకు గురయ్యారు. 'డాడీ.. రా డాడీ' అంటూ సాయినిత్య ఏడుస్తుండగా.. 'నాన్న వస్తాడు.. నాన్నకేం కాదు' అంటూ విక్రాంత్ రోదించిన తీరు కలిచివేసింది. కానీ, అంతలోనే విజయ్ మృతదేహం దొరకడంతో కుటుంబసభ్యులు గుండెలవిసేలా రోదించిన తీరు అక్కడున్న ప్రతి ఒక్కరినీ కంటతడిపెట్టింది.

## మత్స్యకారుడు శంకర్ సాహసం



ముగ్గురూ నీళ్లలో పడిపోవడం అంతా క్షణాల్లో జరిగిపోగా, అక్కడ మత్స్యకారుడు శంకర్ లేకపోతే ముగ్గురి ప్రాణాలు గాల్లో కలిసేవి. కానీ, అరుపులు విన్న వెంటనే క్షణం ఆలోచించకుండా నీళ్లలోకి దూకి పిల్లలిద్దరినీ కాపాడాడు. పిల్లలను ఒడ్డుకు చేర్చిన అనంతరం విజయ్‌ను కాపాడేందుకు ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. అప్పటికే అతడు గల్లంతయ్యాడు. శంకర్‌కు మరొకరు తోడైతే విజయ్‌ను కాపాడే అవకాశాలుండేవి. కానీ, చాన్స్ లేకపోయింది. ప్రాణాలకు తెగించి ఇద్దరి ప్రాణాలను కాపాడిన శంకర్‌ను పోలీసులు, స్థానికులు అభినందించారు.

# 'రైతు నేస్తం' సదస్సులు నేడే

- డీఏవో భాస్కర్

సిరిసిల్ల కలెక్టరేట్, జూన్ 17: వానకాలం సీజన్‌లో పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, యాజమాన్య పద్ధతులపై జిల్లాలోని రైతులకు వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు సలహాలు, సూచనలు అందిస్తారని జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని చంద్రంపేట, వేములవాడ పరిధిలోని హన్మాజీపేట రైతు వేదికల్లో మంగళవారం ఉదయం 10నుంచి 11.10 గంటల దాకా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వానకాలంలో విత్తనాల ఎంపిక, సాగు పద్ధతులు, రైతుల అనుభవాలు, శాస్త్రవేత్తల సలహాలు అందిస్తారని వివరించారు. రైతు లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

- జన్మదిన శుభాకాంక్షలు
- పొలిటికల్
- స్వదేశాగమనం
- లీగల్ ప్రకటనలు
- క్లాసిఫైడ్స్
- పదవీ విరమణ
- ప్రారంభోత్సవం
- శ్రద్ధాంజలి
- సినిమా
- వివాహ మహోత్సవం
- షష్టిపూర్తి మహోత్సవం
మరియు
- అన్ని శుభకార్యాలు

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం.. మన పత్రిక...
నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..
ప్రకటనల విభాగం...
సెల్: 9182 777 571